ప్రజాశక్తి

ఆదివారం 16 మార్చి 2025 5

శ్రీ సత్యసాయి





శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత, తదితరులు

ఫ్రీకాట్ మిల్లు మూసివేతపై ఎమ్మెల్యే బాలకృష్ణ స్పందించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. రాంభూపాల్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. రాంభూపాల్

ప్రజాశక్తి - పరిగి

సత్య సాయి జిల్లా పరిగి మండలంలోని కోడిగినహళ్లి వద్ద గల ఫ్రీకాట్ మిల్లు మూసివేత నిర్ణయంపై స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ స్పందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. సత్య సాయి జిల్లా పరిగి మండలంలోని కోడిగినహళ్లి ఫ్రీ కాట్ బి యూనిట్‌ను రాంభూపాల్ పార్టీ నాయకులతో కలసి శనివారం పరిశీలించారు. అనంతరం కార్మికులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లా కరువు కాటకాలతో కొట్టుమిట్టాడుతున్న సమయంలో పరిశ్రమలకు ప్రత్యేక రాయితీలు కేటాయించి ఇక్కడ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హిందూపురం ప్రాంతంలో ఫ్రీకాట్ మిల్లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారన్నారు. 42 సంవత్సరాలుగా ఎన్నో కుటుంబాలకు జీవనోపాధి కల్పించి కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన పరిశ్రమను నేడు మూసివేసేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తోందన్నారు. అందులో భాగంగా కార్మికులపై పలు రకాలుగా ఒత్తిడి తీసుకొస్తోందన్నారు. అయితే ఇప్పటివరకు కార్మికులు అనేక రూపాల్లో ఉద్యమాలు నిర్వహించారని అయినప్పటికీ పరిశ్రమను పున: ప్రారంభించడానికి ముందుకు రాకపోవడం బాధాకరమని అన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకొస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం ఉన్న పరిశ్రమలను కాపాడుకోలేకపోవడం సిగ్గుచేటు అన్నారు. మిల్లు మూసివేతకు ప్రభుత్వ నిర్ణయాలే కారణమని యాజమాన్యం చెబుతోందని ఇందుకు తగిన విధంగా ప్రభుత్వమే బాధ్యత వహించి మిల్లు పునర్ ప్రారంభానికి యాజమాన్యంతో చర్చలు జరిపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నూలు పరిశ్రమ కొనసాగించడం సాధ్యం కాదని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇక్కడ సుంకాల విషయంలో 30 నుంచి 40శాతం వరకు ఎక్కువ చెల్లించాల్సి వస్తోందన్నారు. అంతేకాకుండా పరిశ్రమ ప్రతినెల కోటి రూపాయలు వరకు కరెంట్ చార్జీలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని యాజమాన్యం తమ దృష్టికి తీసుకు వచ్చిందని తెలిపారు. అంతేకాకుండా ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ముడిసరుకు ధరలు ఇక్కడ ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారన్నారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో పరిశ్రమలకు ప్రత్యేక రాయితీలు కేటాయిస్తూ పరిశ్రమల అభివృద్ధికి చేయూతను ఇస్తున్నాయన్నారు. అయితే ఇక్కడ ఆ పరిస్థితి లేదన్నారు. పాత పరిశ్రమలు ఇప్పుడున్న స్థితిలో నష్టాలను భరిస్తూ ఉత్పత్తిని పరిశ్రమలో కొనసాగించే పరిస్థితి లేదని ఇప్పటికీ నష్టాల పూడ్చుకొని బ్యాంకు రుణాలు చెల్లించే పరిస్థితిలో కూడా లేమని యాజమాన్యం తమ దృష్టికి తీసుకువచ్చిందని రాంభూపాల్ తెలిపారు. వీటికి కార్మికులు కారణం కాదని అయితే మిల్లు మూతపడితే కార్మిక కుటుంబాల రోడ్డును పడతాయని వారిని నమ్ముకున్న పిల్లలు, తల్లిదండ్రుల జీవితాలు చిన్నభిన్నమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సమయంలో ప్రభుత్వం బాధ్యత తీసుకొని కార్మికులకు పూర్తి భరోసాతో పాటు న్యాయం చేసే విధంగా ముందుకు రావాల్సి ఉందన్నారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ తక్షణమే ఈ సంఘటనపై స్పందించాలన్నారు. ప్రభుత్వం యాజమాన్యంతో చర్చించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. తన తండ్రి తీసుకొచ్చిన పరిశ్రమను నిలుపుకోవాల్సిన బాధ్యత ఎమ్మెల్యే బాలకృష్ణపై ఉందన్నారు. వెంటనే బాలకృష్ణ చొరవ తీసుకొని కార్మికుల పక్షాన యాజమాన్యంతో మాట్లాడి మిల్లు కొనసాగింపునకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఈఎస్ వెంకటేష్, ఫ్రీ కాట్ మిల్ యూనియన్ కార్యదర్శి జెడ్పి శ్రీనివాసులు, చిలమత్తూరు సిఐటియు నాయకులు ఫిరంగి ప్రవీణ్ తదితర నాయకులతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువ లైనింగ్ నిలిపివేయాలి

సోమందేపల్లి : హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను వెంటనే నిలుపుదల చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు చేయాలని బడ్జెట్లో ప్రవేశపెట్టడం జరిగిందని ఇది రైతులకు చేస్తున్న పెద్ద ద్రోహం అని విమర్శించారు. లైనింగ్ పనుల వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి సత్య సాయి జిల్లా ఎడారిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ లైనింగ్ పనులకు పెట్టే ఖర్చుతో కాలువను వెడల్పు చేసి మారుమూల ప్రాంతాలకు కూడా హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. కాలువను వెడల్పు చేయడం వల్ల కాలవలో నీటి సామర్థ్యం పెరిగి చుట్టుపక్కల ప్రాంతాలలో ఉన్న రైతుల బోరుబావుల్లో పుష్కలంగా భూగర్భ జలాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేని కాంట్రాక్టర్లకు లాభం కూర్చే లైనింగ్ పనులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం హంద్రీనీవా కాలువ లైనింగ్ నిలుపుదల చేయాలని సోమందేపల్లి మండల కమిటీ తీర్మానం చేసిందని ఈ నిర్ణయాన్ని జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీ మద్దతు తెలియజేస్తుందని తెలియజేశారు. అనంతరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈ ఎస్ వెంకటేష్ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి దాదాపు పది వారాల నుంచి ఉపాధి కూలీలకు కూలి జమ కాలేదని ప్రభుత్వం వెంటనే ఉపాధి కూలీల నిధులు వారి ఖాతాలో జమ చేయాలని కోరారు. పని ప్రదేశాలలో మజ్జిగ, నీరు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, నీడను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పది వారాలుగా ఉపాధి కూలీ ప్రజలకు అందలేదని దీనిపై మండల అభివృద్ధి అధికారి కార్యాలయం వద్ద ఉపాధి కూలీలతో కలిసి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వడ్డే రంగప్ప, హనుమయ్య, వెంకటేష్, రాజగోపాల్, లక్ష్మీనారాయణ, వెంకటేష్, కొండ వెంకటేష్, రవి, కిష్టప్ప, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



సోమందేపల్లిలో సమావేశంలో పాల్గొన్న నాయకులు

అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్లు

మంత్రి సవిత

ప్రజాశక్తి - రొద్దం

అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్లు అని మంత్రి సవిత పేర్కొన్నారు. మండలంలోని పెద్దగువ్వలపల్లి నుండి కల్లుకుంట క్రాస్ వరకు 75 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన బిటి రోడ్డు నిర్మాణానికి మంత్రి సవిత శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. ఎన్నికల హామీలలో భాగంగా ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటి నెరవేస్తున్నామని చెప్పారు. మండల వ్యాప్తంగా ఇప్పటికే 73 పనులు రూ.5. 75 కోట్లతో పూర్తి చేశామనితెలిపారు. అదేవిధంగా త్వరలో నల్లూరు నుండి దండేపల్లి క్రాస్ వరకు రూ. 1, 20 కోట్లతో బిటి రోడ్డు నిర్మిస్తామన్నారు. అదే విధంగా దొడగట్ట నుండి డి ఆర్ కొట్టాల కొరకు రూ.1.30 కోట్లతో బిటి రోడ్డు వేయబోతున్నామన్నారు. నల్లురు నుండి కల్లుకుంట మధ్యలో పెన్నానదిలో బ్రిడ్జి నిర్మాణాన్ని రూ.2. 80 కోట్ల అంచనాతో చేపడుతున్నామని చెప్పారు. రొద్దం మండల వ్యాప్తంగా 44 గోకులం షెడ్లు నిర్మించామని, త్వరలో మరిన్ని గోకులాలు నిర్మిస్తామని అన్నారు. ఎం జె బి స్కూల్ నిర్మాణానికి 20 కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చామని ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని వివరించారు. రైతులకు నాణ్యమైన కరెంటు అందించడంలో భాగంగా దొడగట్టలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కూడా త్వరలో పూర్తి అవుతుందన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న కందుకూర్లపల్లికి చెందిన టిడిపి కార్యకర్తను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా చిన్నమంతుడు గ్రామంలో మాజీ సర్పంచి వెంకటేష్ కుమారుడు సాయి గణేష్ అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో అతడిని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామ్ కుమార్, తహశీల్దార్ఉదయ్ శంకర్ రాజ్, ఇరిగేషన్ ఏఈతో పాటు టిడిపి మండల సీనియర్ నాయకులు మాధవ నాయుడు, కన్వీనర్ నరహరి, రొద్దం మాజీ సర్పంచి అశ్వర్థనారాయణ, చిన్నప్పయ్య, చంద్రమౌళి, యువ నాయకులు శ్రీనాథ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల నృత్య ప్రదర్శన

శేష వాహనంపై ఖాద్రీశుడు

.**ప్రజాశక్తి - కదిరి టౌన్**

ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం శ్రీవారు శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శేష వాహనంపై తిరుమాడవీధుల్లో విహరించారు. అంతకు ముందు వేదపండితులు యాగశాలలో అర్చకులు పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణం, తిరువీధులు కిక్కిరిసిపోయాయి. శ్రీవారికి ఊరేగింపు ముందు జానపద కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాలలో ఆదివారం సూర్య చంద్ర ప్రభ వాహన సేవ నిర్వహిస్తారు. అన్ని వాహన సేవల్లో శ్రీవారు మాత్రమే తిరువీధులలో భక్తులకు దర్శ నమిస్తారు. శేషవాహన సేవలో శ్రీదేవి, భూదేవి సమేతుడై స్వామివారు తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.



శేషవాహనంపై శ్రీవారు

కదిరికి కొక్కంటి జ్యోతి: బ్రహ్మోత్స వాలలో భాగంగా కొక్కంటి పాలేగాళ్ల ఆధ్వర్యంలో నిర్వహించే కొక్కంటి జ్యోతి కార్యక్రమం శనివారం తెల్లవారు జామున బయల్దేరి కదిరికి సాయంత్రంలోపు చేరుకుంది. ఎన్నో ఏళ్లుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. కొక్కంటి పాలేగాళ్ల ఇంటిలో జ్యోతికి శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి, శనివారం నల్లచెరువు మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి క్షేత్రం మీదుగా కదిరికి చేరుకుంది., అన్నమయ్య జిల్లా ములకలచెరువు, పీటీఎం, తంబళ్లపల్లి మండలాల భక్తులు కాలినడకన కదిరి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చి, జ్యోతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

23న మాలల సింహగర్జన

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఎస్సీ వర్గీకరణ క్రిమిలేయర్‌ను వ్యతిరేకిస్తూ ఈ నెల 23వ తేదీ తిరుపతిలో నిర్వహించే రాయలసీమ మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని మాలమహానాడు జిల్లా నాయకులు రామచంద్ర కోరారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో సింహగర్జన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పిచ్చల రామచంద్ర, పి.శ్రీనాథ్, కె.రామచంద్ర, కదిరి త్యాగరాజు, ముని, నరేష్, ఆంజనేయులు, సూర్యనారాయణ, మునిస్వామి, బాలవేమయ్య, శ్యామ్ పాల్గొన్నారు.



సమావేశంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ తదితరులు

డప్పు కార్మికుల ధర్నాను జయప్రదం చేయండి

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ

ప్రజాశక్తి-హిందూపురం

విజయవాడ ధర్నా చౌక్ లో ఈ నెల 18న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని డప్పు కళాకారుల సంఘం కెవిపిఎస్ అనుబంధం జిల్లా కార్యదర్శి ఎంవి.రమణ కోరారు. శనివారం సిఐటియు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, డప్పు కళాకారులకు డప్పు, గజ్జలు, బట్టలు దాంతోపాటు ఇల్లు, ఇంటి స్థలం మంజూరు చేయాలన్నారు. డప్పు కళాకారులకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని డప్పు కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్లతో తలపెట్టిన ధర్నాకు అధిక సంఖ్యలో డప్పు కళాకారులు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, మురళి, అన్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతి విద్యార్థికి పదో తరగతి పునాది లాంటిదని, భవిష్యత్తు బంగారు బాటలో ఉండాలంటే పదవ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. హిందూపురం పురపాలక సంఘం పరిధిలోని 37వ వార్డు ముద్దిరెడ్డిపల్లిలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం పదవ తరగతి చదువుతున్న బాలికలకు కౌన్సిలర్ మహాలక్ష్మి నాగేంద్ర సౌజన్యంతో పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మహాలక్ష్మి, టీడీపి మాజీ ఫ్లోర్ లీడర్ బండారు బాలాజీ, టీడీపి సీనియర్ నాయకులు కోరముట్ల ఆదిశేషు, హెచ్.ఎం. జ్యోతి, పాఠశాల చైర్మన్ రవికుమార్, నాయకులు కొండప్ప, నాగరాజు, మధు, గిరి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ సాయి కాళేశ్వర్ ఆశయాలను కొనసాగిస్తాం

షిర్డీ సాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప



పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం రూ. 28 లక్షల విలువైన చెక్కు అందజేస్తున్న శిల్ప

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

డాక్టర్ సాయి కాళేశ్వర్ మానవసేవే మాధవ సేవగా భావించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని, వాటిని కొనసాగించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప తెలిపారు. స్థానిక శివసాయి మందిరం ప్రాంగణంలో శనివారం గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో డాక్టర్ సాయి కాళేశ్వర్ 13వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీనియర్ న్యాయవాది గురుప్రసాద్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ముందుగా సాయి కాళేశ్వర్ సమాధికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శిల్ప మాట్లాడుతూ కాళేశ్వర్ పేదల సంక్షేమమే ధ్యేయంగా కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. నవ్యశ్రీ కంటి ఆసుపత్రి ఏర్పాటు చేసి ఎందరికో నేత్రదానం చేశారన్నారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా ప్రజల గుండెల్లో నేటికీ చిరస్థాయిగా ఉన్నారన్నారు. ఆయన చేపట్టిన సేవా కార్యక్ర మాలను కొనసాగిస్తామన్నారు. ఇందులో భాగంగా పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం పోలీసు శాఖకు రూ. 28 లక్షల చెక్కును అందజేశారు. కంటి ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్న వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. ముఖ్య అతిథులు కాళేశ్వర్ చేపట్టిన సేవ, అభివృద్ధి కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, తండ్రి సుబ్బరాయుడు, నాగిరెడ్డి, చిట్టిబాబు, హరి, బాబుప్రసాద్, ప్రగతి శ్రీనివాసులు, మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు జాన్‌ప్రియనాథ్, ఆశ్రమ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల హాజరుపట్టికలో ముందుగానే సంతకాలు

ఎమ్మెల్యే తనిఖీలో వెల్లడి అధికారులపై ఆగ్రహం



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని సిజి ప్రాజెక్టులో గల గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో కొందరు ఉపాధ్యాయులు చేస్తున్న అక్రమాలు ఎమ్మెల్యే తనిఖీలో బయటపడ్డాయి. తాము విధులకు హాజరుకాకున్నా ముందురోజులకు కూడా హాజరుపట్టికలో కొందరు ఉపాధ్యాయులు సంతకాలు చేశారు. దీన్ని గమనించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం మండల పరిధిలోని సిజి ప్రాజెక్టులో గల గిరిజన గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడి పరిస్థితులను ప్రిన్సిపల్ సుస్మిత జ్యోత్స్న ను అడగగా ఆమె పొంతన లేని సమాధానాలు చెప్పగా ఎమ్మెల్యే రికార్డులను పరిశీలించారు. అందులో 15, 17, తేదీలకు సంబంధించిన అటెండెన్స్‌లో ముందస్తుగానే ఇద్దరు ఉపాధ్యాయులు సంతకాలు పెట్టడాన్ని గమనించి ప్రిన్సిపల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఫోన్లో ఆదేశించారు. పాఠశాలలో అన్ని సౌకర్యాలు, ఉన్నప్పటికీ ఇక్కడ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా గతంలోనూ విద్యార్థులు చాలా ఇబ్బందులు పడ్డారని ఇప్పటికి అదే తంతు జరుగుతోందని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశాడు. అనంతరం మెనూ పరిశీలించి ఆసంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడి విద్యార్థినులతోనే వడ్డించడాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి సమస్యలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి పరిస్థితులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్‌కు ఫోన్ ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి మాజీ కన్వీనర్ శంకర్ నాయుడు రాజారెడ్డి ఆనంద్ రెడ్డి, కావడి ప్రవీణ్ కుమార్, మాజీ జెడ్పిటిసి రవీందర్ రెడ్డి, తోట కిషోర్ సోంపాలెం నాగభూషణ, చిన్నప్ప, మల్లెపూల రవి, పీజీ మల్లికార్జున, నాగమల్లి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు ప్రారంభం : మండల పరిధిలోని ఎగువ మబ్బు వారి పల్లిలో సిసి రోడ్డు పనులను కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నామన్నారు.

హెచ్ఎన్ఎస్ఎస్ లైనింగ్‌పనులు నిలిపేయాలి

జలసాధన సమితి నాయకులు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - హిందూపురం

హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ప్రధాన కాలువ లైనింగ్ పనులను వెంటనే నిలిపివేయాలని జలసాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం ఇందిరా పార్క్ లో ఉన్న కల్లూరు సుబ్బారావు విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ కు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జలసాధన సమితి నాయకులు మాట్లాడుతూ, గత ఐదారు సంవత్సరాల నుండి హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా నీళ్లు వస్తున్నప్పటికీ ఆశించిన ప్రయోజనం నెరవేరలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం కొన్ని చెరువులు మాత్రమే నీరు ఇస్తున్నారని, ఈ సంవత్సరము 27 టీఎంసీలు రాగా అందులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు 24 టీఎంసీలు వచ్చాయని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో 2500 చెరువులు ఉండగా 89 చెరువులకు మాత్రమే నీరు ఇచ్చారని, ప్రతి సంవత్సరం ఈ విధంగా కొన్ని చెరువులు కు మాత్రమే నీరు ఇస్తే ఆశించిన ప్రయోజనం నెరవేరదని పేర్కొన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు నిర్దేశించిన విధంగా రాయలసీమలో ఆరు లక్ష ఎకరాలకు, ఉమ్మడి జిల్లాలో 3,45,000 వేల ఎకరాలకు నీరు ఇవ్వగలిగితేనే ప్రయోజనం ఉంటుందని అన్నారు. ఈ దశలో హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి నూరు టీఎంసీలను ఎత్తిపోతల ద్వారా కొత్త ఆయకట్టుకు నీరు ఇస్తేనే ఉమ్మడి జిల్లాకు ప్రయోజనం ఉంటుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కాలు వెడల్పు చేయకుండా లైనింగ్ చేయటం వల్ల ప్రయోజనం లేదని తెలిపారు. కావున హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను రద్దు చేయాలని కాలువను వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు స్పందించాలన్నారు. పార్టీలకతీతంగా ఉద్యమ ఉద్యమించి ఉమ్మడి జిల్లాను రక్షించుకోవాలని జలసాధన సమితి నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి గౌరవాధ్యక్షులు సీనియర్ అడ్వకేట్ రామచంద్రారెడ్డి, అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, ఒపిడిఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రచయిత సడ్లపల్లి చిదంబర రెడ్డి, రైతు సంఘం నాయకులు సిద్ధారెడ్డి, జలసాధన సమితి నాయకులు ఫరూక్, జమీల్, అమానుల్లా, దాసరి హరి, తిప్పేస్వామి, నవీన్, పరిగి రాజేష్, ఎస్‌యుసిఐ నాయకులు గిరీష్, సిఐటియు నాయకులు రాము , బిఎస్‌పి నాయకులు కిష్టప్ప, పర్యావరణవేత్త భాస్కర్ రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపల్ గంగిరెడ్డి, చైతన్య సంస్థ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సుందరవనంగా ధర్మవరం : మంత్రి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణాన్ని సుందరవనంగా తీర్చిదిద్దుదామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. మంత్రి శనివారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, ఆర్డీవో మహేష్, మున్సిపల్ అధికారులు, బిజెపి, టిడిపి, జనసేన నాయకులతో కలిసి పట్టణంలోని ఇందిరానగర్ హరిజన వాడలో పరకలు చేత పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. మొక్కలు నాటారు. మంత్రి మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటి సంరక్షించాలని, ఎక్కడబడితే అక్కడ చెత్త వేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. అనంతరం కొత్తపేట రైల్వే బ్రిడ్జి ఆవరణలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలని, కాగితపు బ్యాగులనే వాడాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ పట్టణ పురవీధుల గుండా సాగింది. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపల్ సురేష్‌బాబు, కెహెచ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకరరెడ్డి, పబ్లిక్ హెల్త్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేష్ బాబు, ఎమర్జెన్సీ అసోసియేషన్ అధ్యక్షులు పిన్ని ప్రసాద్, హోల్‌సేల్ కిరాణా అసోసియేషన్ కార్యదర్శి శేషు, టిడిపి నాయకులు కాటమయ్య, రాఘవ, ముత్యాలప్ప, బిజెపి నాయకులు శ్రీనివాస్, జింకా చంద్రశేఖర్, ఓబులేసు, చంద్రమౌళి, లీలావతి, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



ధర్మవరంలో మొక్క నాటి నీరు పోస్తున్న మంత్రి సత్యకుమార్

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

బత్తలపల్లి : ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన బిసి బాలికల వసతి గృహాన్ని మంత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థినుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం రూ. 2 కోట్ల నిధులతో త వసతి గృహాన్ని నిర్మించిందన్నారు. విద్యార్థినులు లక్ష్యం దిశగా అడుగులేస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. వసతి గృహంలోని గదులను, సౌకర్యాలను పరిశీలించి, విద్యార్థినుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేష్, ఎంపీడీవో నరసింహనాయుడు, జడ్పిటిసి కోటి సుధ, కోటి సూర్య ప్రకాష్‌బాబు, హెచ్‌ఎం జయశ్రీ, సిబ్బంది, నాయకులు మల్లికార్జున, నారాయణస్వామి, అధికారులు పాల్గొన్నారు.

హంద్రీనీవా లైనింగ్ పనులకు శంకుస్థాపన

ముదిగుబ్బ : మండలంలోని మలకవేముల క్రాస్ వద్ద హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ లైనింగ్ పనులకు మంత్రి సత్య కుమార్ యాదవ్ శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గం సహా రాయలసీమకు తాగు, సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా కృషి చేస్తున్నారు. మండలంలోని పట్నం వరకూ 184 కి.మీ. పనులను రూ. 936.7 కోట్ల వ్యయంతో, పుంగనూరు బ్రాంచ్ కెనాల్లో పట్నం నుంచి తనకల్లు మండలంలోని కొక్కంటి క్రాస్ వరకూ 75 కి.మీ. లైనింగ్ పనులను రూ. 319.6 కోట్ల వ్యయంతో చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణయాదవ్, ఆర్డీవో మహేష్, ప్రాజెక్టు మేనేజర్ వెంకటరావు, మండల అధ్యక్షులు అంజనిరెడ్డి, నాయకులు సోమల ప్రకాష్‌నాయుడు, నారాయణస్వామి, వైస్ ఎంపిపి వెంకటరెడ్డి, ఎంపిటిసి చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి

ముదిగుబ్బలో బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానిక యువకులు మంత్రి సత్యకుమార్ యాదవ్ వినతి పత్రం అందజేయగా ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో బాబ్‌జాన్, రాగూర్, బాబావలి, ప్రకాష్, ఇమాం, దాదాపీర్, వంశీ, షేక్షా, మధు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి : పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు అధికా రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృష చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ సూచించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం 27, 29, 39 వార్డుల ప్రజలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ప్రజలు హౌసింగ్, డ్రెయినేజీ, రోడ్లు, తాగునీరు సమస్యలను ఏకరువు పెట్టారు. శ్రీరామ్ మాట్లాడుతూ అర్హులందరికీ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్, భీమినేని ప్రసాద్‌నాయుడు, మాధవరెడ్డి, బెల్లం తిరుపాల్, ముద్దుకృష్ణ, ఆనంద రెడ్డి, రాయపాటి శివ, రాళ్లపల్లి షరీఫ్, నాగూర్ హుస్సేన్, రహీంబాషా, కమతం కాటమయ్య, బీరే గోపాలకృష్ణ, కేశగాళ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-బత్తలపల్లి

విద్యార్థులు బాగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని ప్రధానోపాధ్యాయుడు వెంకట రాముడు సూచించారు. మండలంలోని రామాపురం ఉన్నత పాఠశాలలో శనివారం సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పట్టుదలతో చదివితే వంద శాతం ఉత్తీర్ణతతో పాటు మంచి ర్యాంకులు సాధించగలరన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివినప్పుడే విద్యలో రాణిస్తారన్నారు. క్రమశిక్షణ అలవాటు చేసుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. పరిటాల యూత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరాములు, రవీంద్ర, గంగిరెడ్డి, చంద్రశేఖర్, వరదరాజులు, లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు తరిగోపుల నారాయణప్ప, తరిగోపుల చౌదరి, ఎస్ఎంసి ఛైర్మన్ రాజకుళ్లాయప్ప, తరిగోపుల రాము, నరిశెట్టి రామాంజనేయులు, బయన్న, దివాకర్, రాము, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న పరిటాల యూత్ సభ్యులు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ వి.రత్న

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పట్టణంలోని మంగళకర కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని శనివారం ఎస్పీ రత్న సందర్శించారు. ఆమె పరీక్ష కేంద్రం పరిసరాలు, భద్రతా చర్యలు, పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. విమర్శలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించడానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. పరీక్ష జరుగుతున్న తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష సమయంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎస్పీ వెంట రూరల్ ఎస్ఐ లింగన్న, సిబ్బంది ఉన్నారు.

రేపు చేనేత కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చేనేత రంగానికి తగినంత నిధులు కేటాయించలేదని, అందుకు నిరసనగా ఈ నెల 17వ తేదీ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని ఎపి చేనేత కార్మిక సంఘం నాయకులు తెలిపారు. ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, గౌరవాధ్యక్షులు వెంకటస్వామి, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చేనేత కార్మికులకు బడ్జెట్లో రూ. 2 వేల కోట్లు కేటాయించాలని, ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదినారాయణ, శ్రీనివాసులు, రంగయ్య, సిరివెన్నెల దేవేంద్ర, శివ, వేణు తదితరులు పాల్గొన్నారు.

నూతన పద్ధతుల్లో వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు : జెడిఎ

ప్రజాశక్తి-పరిగి

వినూత్న పద్ధతుల్లో వ్యవసాయం సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి వైవి సుబ్బారావు రైతులకు సూచించారు. ఆయన శనివారం మండలంలోని గొరివెనహళ్లి గ్రామంలో పర్యటించారు. పిడిఎంఎస్(ప్రీ మాన్సూన్ డ్రై సొయింగ్) ఏటీఎం, ఎ గ్రేడ్ మోడల్ పద్ధతుల్లో పంటలు సాగు చేసిన రైతులు విజయ్‌కుమార్, నంజుండప్ప పొలాలను సందర్శించారు. ఎంసిఆర్‌పి తిప్పమ్మ మాట్లాడుతూ ఎటిఎం, పిడిఎంఎస్ పద్ధతుల్లో సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వారి వెంట ఎఒ విజయభారతి, ఎఇఒలు, మోద రైతు సేవా కేంద్రం సిబ్బంది, ప్రకతి వ్యవసాయం సిబ్బంది, రైతులు ఉన్నారు.



పంట పొలాన్ని పరిశీలిస్తున్న జెడిఎ సుబ్బారావు

రేపు సంత మార్కెట్ వేలం

ప్రజాశక్తి-లేపాక్షి

లేపాక్షి పంచాయతీలో వారపు సంతలో, బస్టాండ్ ఆవరణలో వాహనాలకు రుసుము వసూలు చేయడానికి పంచాయతీ కార్యాలయంలో సోమవారం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారున. ఆసక్తి ఉన్న వారు సోమవారం ఉదయం పది గంటలకు వేలం పాటలో పాల్గొనవచ్చున్నారు.

మసీదుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కదిరిటౌన్

గతంలో ఇచ్చిన మాట ప్రకారం వైసిపి బిసి విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ శనివారం గాండ్లపెంట మండలంలోని కమతంపల్లి మసీదుకు రూ. 10వేలు అందజేశారు. ఆ మొత్తాన్ని మసీదు కమిటీ సభ్యులు ఫకృద్దీన్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రారెడ్డి, ఇస్మాయిల్, కమిటీ సభ్యులు ఫకృద్దీన్, నజీర్, ముబారక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-పరిగి

స్థానిక తెలుగు, ఉర్దూ జడ్పీ హైస్కూళ్లతో పాటు కెజిబివిలో పదో తరగతి విద్యార్థులు సుమారు 500 మంది విద్యార్థులకు శనివారం టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో విద్యాసామగ్రి పంపిణీ చేశారు. మంత్రి సవిత ఆదేశాల మేరకు విద్యార్థులకు అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేల్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎలీస్ సత్తిరాజ్, నాయకులు నాగభూషణ్‌గౌడ్, చౌడప్ప, మహేష్, వడ్డెర చంద్రశేఖర్, కంకర శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు రాయితీలు : ఏఈ

లేపాక్షి : విద్యుత్ వినియోగదారులు ప్రత్యేక రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఏఈ వెంకటేశ్వర్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కిలో వాట్‌కు రూ. 2,250కు గానూ రూ. 1,250, 2 కిలో వాట్‌లకు రూ. 4450కు గానూ రాయితీ ధర రూ. 2,450 చెల్లిస్తే చాలన్నారు. ఈ అవకాశం కొద్దీ రోజులు మాత్రమే అన్నారు.

ఎపిజిబి ప్రధాన కార్యాలయం తరలించొద్దు

పుట్టపర్తి క్రైమ్ : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే ఉంచాలని, అమరావతికి తరలించాలనే ఆలోచనను విరమించుకోవాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.గంగాధర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎపిజిబి మేనేజర్‌కు వినతి పత్రం సమర్పించారు. అలాగే గ్రామీణ బ్యాంకుల శాఖలను కెనరా బ్యాంకులో విలీనం చేయాలన్న ప్రతిపాదనలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, చంద్ర, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పివిఎస్ పాఠశాలలో పసుపు దినోత్సవం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక పివిఎస్ పాఠశాలలో శనివారం నర్సరీ విద్యార్థుల చేత పసుపు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఛైర్మన్ పివి.నాయుడు మాట్లాడుతూ పిల్లలకు పసుపురంగు, దాని ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పసుపు రంగు వస్త్రధారణలో హాజరై ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో విచిత్ర సంఘటన

మద్యం మత్తులో స్పేర్ టైరుపై నిద్రించి వ్యక్తి ప్రయాణం

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొత్తచెరువు నుంచి హిందూపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సులో శనివారం ఓ విచిత్రమైన సంఘటన చోటుచేసుకుంది. మధ్యాహ్నం ఓ వ్యక్తి మద్యం మత్తులో బస్సు వెనుక భాగంలో ఉన్న స్పేర్ టైర్ ఎక్కి నిద్రపోయాడు. ఇది గమనించని డ్రైవర్, కండక్టర్ కొత్తచెరువు నుంచి హిందూపురం బయల్దేరారు. సుమారు 20 కిలోమీటర్లు వెళ్లిన తరువాత కొండపల్లి వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తులు గుర్తించి బస్సును ఆపారు. దీంతో డ్రైవర్, కండక్టర్ బస్సు కింద భాగంలో స్పేర్ టైర్ కింద నిద్రిస్తున్న వ్యక్తిని తీవ్రంగా మందలించి కిందికి దింపి పంపించారు. అయితే ఎలాంటి ప్రమాదం జరగక పోవడంతో ప్రయాణికులు, డ్రైవర్, కండక్టర్ ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి : మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. నగర పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని దర్గా సర్కిల్‌లో 'స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమం నిర్వహించగా మంత్రి ముఖ్య అతిథిగా హాజరై స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. అలాగే చీపురు చేత పట్టి రోడ్డును ఊడ్చారు. మంత్రి మాట్లా డుతూ పరిసరాల పరిశుభ్రత ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చు అన్నారు. పెనుకొండను అత్యంత పరిశుభ్రత ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్, సిఐ రాఘవన్, టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, మండల కన్వీనర్ సిద్దయ్య, నాయకులు వెంకటరాముడు, శ్రీనివాసులు, కేశవయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, రామకృష్ణ, పోతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు మరమ్మతులను పరిశీలిస్తున్న మంత్రి సవిత

రోడ్ల మరమ్మతులు పరిశీలన

రోడ్ల మరమ్మతులు నాణ్యతగా చేపట్టాలని మంత్రి సవిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పట్టణంలోని మడకశిర రహదారిలో అడ్డాకులపల్లి గ్రామ సమీపంలో జరుగుతున్న రోడ్డు మరమ్మతులను మంత్రి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పనుల్లో అలసత్వం వహించకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట అధికారులు, నాయకులు ఉన్నారు.

వినియోగదారుల హక్కుల దినోత్సవంపై అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పట్టణంలోని జగరాజుపల్లి మోడల్ హైస్కూల్‌లో శనివారం ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ గురునాథ్ అధ్యక్షతన ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కుల రక్షణ, బాధ్యతలు, తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, అవసరంలేని పదార్థాలను కొనుగోలు చేయకపోవడం, పెళ్లిళ్లు, బర్త్ డేలు, పార్టీల పేరుతో జరిగే ఆహార వృథాను అరికట్టాలన్నారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు ఏ వస్తువు కొనుగోలు చేసినా వాటిపై ఎమ్మార్పీ, తయారీ తేదీ, ఎక్స్‌పరీ డేట్‌ను తప్పకుండా గమనించాలన్నారు. అధ్యాపకులు రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాల్లో కాలుష్యాన్ని వెదజల్లే వస్తువులను వాడకుండా విద్యార్థులు జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రతిమ, సురేఖ, పిడి అంజద్‌బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న అతిథులు

నాటుసారాను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి-కదిరి టౌన్

గ్రామాల్లో నాటుసారాను పూర్తిగా నిర్మూలిద్దామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సూచించారు. నవోదయం 2.0లో భాగంగా శనివారం ఎక్సైజ్ అధికారులు చిగురుమాను తండా, చవిటితండా, రాచేవారిపల్లి తండా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి కళాకారులతో జానపద గేయాల ద్వారా నాటుసారాతాగడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. నాటుసారా తయారు చేసినా, రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ప్రజల చేత నాటుసారా నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహులు, ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి, టాస్క్ ఫోర్స్ సిఐ హరికృష్ణ, ఎస్ఐలు సింహ, శ్రీధర్, దత్తాత్రేయ, సర్పంచులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నాటుసారా దుష్పరిణామాలప అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

కాంట్రాక్ట్ కార్మికులను ఆప్కాస్‌లోనే కొనసాగించాలి : సిఐటియు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కాంట్రాక్ట్ కార్మికులను ఆప్కాసలోనే యథావిధిగా కొనసాగించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివిఎల్.నరసింహులు, జిల్లా కోశాధికారి సాంబశివ డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులను ఆప్కాస్ వ్యవస్థలోనే కొనసాగించి, కనీస టైం స్కేల్, గ్రాట్యుటీ, సంక్షేమ పథకాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని, వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని కోరుతూ ఈ నెల 19వ తేదీ విజయవాడలో ఆప్కాస్ ఔట్ సోర్సింగ్ ఫెడరేషన్, జెఎసి ఆధ్వర్యంలో చేపట్టనున్న రాష్ట్ర ధర్నాలో బిసి వెల్ఫేర్ హాస్టళ్లలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం కదిరి డివిజన్ అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ బాలాజీకి సిఐటియు నాయకులు, కార్మికులు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ముస్తాక్, కార్మికులు నిర్మల, మమత, సోము, రఘు తదితరులు పాల్గొన్నారు.



అధికారికి వినతి ఇస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ఇంటర్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-గుడిబండ

ఇంటర్ విద్య పూర్తి చేసుకుని బయటికి వెళ్తున్న విద్యార్థులకు శనివారం స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ప్రసాద్, సిబ్బంది కళాశాలలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థి దశలో ఇంటర్ విద్య అత్యంత కీలకమైందని, భావి భారత భవితకు ఇదే మూలం అన్నారు. విద్యార్థుల ఉన్నత చదువులు పూర్తయ్యే ఎలాంటి ఆటంకం కలిగించరాదని తల్లిదండ్రులకు సూచించారు. ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు పొంది సమాజంలో గొప్ప సేవకులు కావాలని కోరారు. విద్యార్థులు కళాశాలను విడిచిపోతుంటే చాలా బాధగా ఉందన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రిన్సిపల్ ప్రసాద్

కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-గాండ్లపెంట

కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి సయ్యద్‌బాషాకు పంచాయతీ కార్మికులు అక్కులప్ప, నరసింహులు, కదిరప్ప వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'కి రెండు దశాబ్దాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిత్యం కరువులకు నిలయమైన అనంతపురం జిల్లాలో బతుకుదెరువు కోసం వలస బాటలు జరిగేవి. వాటిని నివారించాలన్న అనేక డిమాండ్ల మేరకు 2004లో వామపక్షాల మద్దతుతో ఏర్పడిన యుపిఎ-1 ప్రభుత్వ హయంలో ఉపాధి హామీ చట్టాన్ని చేయడం జరిగింది. పని కావాలని కోరే ప్రతి ఒక్క గ్రామీణ ప్రాంతవాసికి పని కల్పించాలన్నది ఈ చట్టాన్ని చేయడం జరిగింది. దీన్ని రూపొందించి 2004లో ప్రారంభించారు. అది కూడా అనంతపురం జిల్లాలోని నార్పల మండలంలోని బండమీదపల్లి గ్రామంలో ప్రారంభమైంది. అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అప్పుడు ప్రారంభమైన ఈ ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతంలోని వ్యవసాయ కూలీల జీవన విధానంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చింది. అప్పటి వరకు పని కావాలంటే కూలీ చాలా తక్కువగా ఉండేది. అది కూడా పూర్తి స్థాయిలో పనులుండేవి కావు. ఈ పథకం అమల్లోకి వచ్చాక కూలీలకు కొంత ఊరటనిచ్చింది. వలసలు కొంత వరకు నివారించగలిగిందనే చెప్పవచ్చు. అయితే క్రమక్రమంగా ఈ పథకాన్ని నీరుగార్చే చర్యలను గత కొన్నేళ్లుగా ఎన్డీఏ ప్రభుత్వం చేపడుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిధుల కేటాయింపులు కూడా అదే రకంగా తగ్గిపోతూ వస్తున్నాయి. జిల్లాలో ఉపాధి హామీ పథకం కోతలు తప్పడం లేదు. ఈ ఏడాది కూడా సగటున 50 రోజుల్లోపు పని దినాలు మాత్రమే పని కల్పించడం జరిగింది. ఆ నిధుల వినియోగంలో పెద్దఎత్తున సిమెంటు రోడ్లు, భవనాల నిర్మాణాలకు వినియోగిస్తుండటం గమనార్హం. అసలు లక్ష్యాన్ని నీరుగార్చే విధంగా అమలు తీరు ఉంటోంది. దీనికోసం ఇప్పుడు సమస్యలను అధ్యయనం చేయడానికి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం సిద్ధమైంది. ఈ వారంలో జిల్లాలో అన్ని మండలాల్లోనే స్కూటర్ యాత్ర ద్వారా ఉపాధి హామీ పథకం అమల్లో వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ఇందులో వస్తున్న ప్రధాన సమస్యల్లో పది వారాలైన అందని బిల్లుల ఉంటున్నాయన్నది వస్తోంది. అదే విధంగా పథకంలో పేర్కొన విధంగా పనిచేసే ప్రాంతంలో నీడ, నీటి సౌకర్యాలుంటం లేదు. ఈ సమస్యలు పరిష్కారం కోసం వచ్చే వారంలో సచివాలయాల వద్ద నిరసనలకు సిద్ధమైంది. ఏది ఏమైనా ఈ పథకం అమల్లోకి వచ్చినప్పటి నుంచి జిల్లా గ్రామీణ ప్రాంతంలోని వ్యవసాయ కూలీల్లో కొంత మనోధైర్యం నింపిందని చెప్పవచ్చు. దీన్ని మరింతగా విస్తరించాలన్న డిమాండ్ చేస్తున్నారు. నగరాల్లో ఇటువంటి పథకాన్ని ప్రారంభించాలన్న డిమాండ్ వస్తోంది. ఎందుకంటే కొవిడ్ సమయం నుంచి నగరాల్లోనూ ఉపాధి సమస్యలు నెలకొన్నాయి. పని కల్పించడం ద్వారా కొంత వరకైనా ఊరట లభించే అవకాశముందని కోరుతున్నారు. ఇక ఈ వారంలో వైసిపి, జనసేన ఆవిర్భావ దినోత్సవాలు జరిగాయి. వైసిపి యువతపోరుతోనూ నిరసన ప్రదర్శన నగరంలో చేపట్టింది. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.





భూమిపూజలో పాల్గొన్న ఎంపి పార్థసారథి

గార్మెంట్స్ ఫ్యాక్టరీకి భూమిపూజ

రొద్దం : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతోనే రొద్దంలో గార్మెంట్స్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు భూమిపూజ చేసినట్లు ఎంపి బికె.పార్థసారథి తెలిపారు. రొద్దం, ఆర్.మరవపల్లి మధ్యలో ఉన్న రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద శనివారం రేణుక గార్మెంట్స్ పరిశ్రమకు ఎంపి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలం నుంచి వందల మంది మహిళలు పరిగి మండలంలోని గార్మెంట్స్ ఫ్యాక్టరీలో పనికి వెళ్తున్నారన్నారు. వారి కోసం ఇక్కడే గార్మెంట్స్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, మహిళా నాయకులు, నరసింహులు పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

నల్లచెరువు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉండగా కోరం లేకపోవడంతో సమావేశాన్ని ఆదివారానికి వాయిదా వేసినట్లు ఎంపిడిఒ రఘునాథ్ గుప్తా తెలిపారు. అధికారులు హాజరైనా, పలువురు ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరవడంతో కనీసం కోరం సభ్యులు కూడా రాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఒ తెలిపారు.

నేడు గుండె, కంటి వైద్య శిబిరం

గుడిబండ : స్థానిక సిద్దేశ్వర మెడికల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత గుండె, కంటి వైద్య శిబిరం నిర్వహి స్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ లోకేష్ తెలిపారు. అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆస్పత్రి వైద్యులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ వైద్య సేవలు అందిస్తారని తెలిపారు.

మేతకెళ్లిన గొర్రెలు అగ్నికి ఆహుతి

పుట్టపర్తి క్రైమ్ : మండలంలోని గంగిరెడ్డిపల్లిలో శనివారం 19 గొర్రెలు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. హంసి నాగరాజు అనే వ్యక్తి సాయంత్రం మేత కోసం గొర్రెలను అటవీ ప్రాంతమైన గుడిబాపని కుంట వద్దకు తోలుకెళ్లాడు. గుర్తుతెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టడంతో మంటలు పెద్దఎత్తున వ్యాప్తి చెందడంతో గొర్రెలు మంటల్లో చిక్కుకుపోయి మృత్యువాత పడ్డాయి. బాధితుడు మాట్లాడుతూ గొర్రెలు మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నానని, మంటల్లో గొర్రెలు మృతి చెందడంతో జీవనాధారం కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశాడు. దాదాపు రూ. 2 లక్షలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

కళాశాల ప్రిన్సిపల్‌పై కేసు

ప్రజాశక్తి-కదిరి టౌన్

హోలీ పండుగ సందర్భంగా పట్టణంలోని అమృతవల్లి డిగ్రీ ప్రిన్సిపల్ విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఈ నెల 14వ తేదీ హోలీ వేడుకల్లో భాగంగా అమృతవల్లి మహిళా డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో ప్రిన్సిపల్ కొందరు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. ఆ వీడియోలు సోషియల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో ఆ సంఘటనపై విచారించి మహిళా కానిస్టేబుల్ గౌసియా ఫిర్యాదు మేరకు ప్రిన్సిపల్‌పై కేసు నమోదు చేశారు.

విద్యా కోర్సులపై అవగాహన బోర్డు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, కెజిబివి, జూనియర్ కళాశాలలో శనివారం సిఐ శివరాముడు వివిధ విద్యా కోర్సులపై అవగాహన బోర్డు ఏర్పాటు చేశారు. ఏ కోర్సు చేస్తే భవిష్యత్తులో ఏ రంగంలో స్థిరపడవచ్చని విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన తెలిపేలా బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తుమ్మల మనోహర్ నాయుడు, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని ఎగువ తుమ్మలకుంట గ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం గ్రామస్తులు సర్పంచి సంధ్య, పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి పూట బయటకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొందన్నారు. ఈ విషయంపై పలుమార్లు గ్రామ కార్యదర్శికి విన్నవించినా ఫలిత లేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. వినతి ఇచ్చిన వారిలో గౌస్, గంగాధర్, తుమ్మలకుంట గ్రామస్తులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

మండలంలోని ఓబుళదేవరపల్లి గ్రామంలో వెలసిన శ్రీఓబులేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఎజిపి భాస్కర్ రెడ్డి తెలిపారు. ఆలయం వద్ద శనివారం ఆలయ అభివృద్ధి, భక్తులకు మౌలిక వసతులు, తగిన సౌకర్యాల కల్పనపై గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఆలయాన్ని ఏవిధంగా అభివృద్ధి చేయాలి, నిధులు ఎలా సమీకరించాలి అనే అంశాలపై చర్చించారు. సమావేశంలో తిప్పారెడ్డి, కృష్ణారెడ్డి, ఓబుల్‌రెడ్డి, రామ్‌గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు : ఎమ్మెల్యే



పాముదుర్తిలో పిహెచ్‌సిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

ప్రజాశక్తి-బుక్కపట్నం

కూటమి ప్రభుత్వంలో వైద్య ఆరోగ్యశాఖకు పెద్ద పీట వేసి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేలా సిఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. మండలంలోని పాముదుర్తి గ్రామంలో రూ.1.79 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆమె మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ ద్వారా నాణ్యమైన వైద్యం అందిస్తున్నారన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యంతో పాటు మందులు అందిస్తున్నారని తెలిపారు. ఐదేళ్ల వైసిపి పాలనలో పేదలకు కనీసం వైద్యం కూడా సక్రమంగా అందించలేదన్నారు. కార్యక్రమంలో సర్పంచి గుర్రంపాటి జ్యోతి, మెడికల్ ఆఫీసర్లు జ్యోతి, వెంకటనారాయణరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ మల్లిరెడ్డి, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు కృష్ణమూర్తి, గంగాధర్, నరేష్, ఆంజనేయులు, కిష్టప్ప, శివారెడ్డి, కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతలో పుట్టపర్తిని ఆదర్శంగా నిలుపుదాం - ఎమ్మెల్యే

పుట్టపర్తి అర్బన్ : అందరం కలిసికట్టుగా పనిచేసే పుట్టపర్తిని పరిశుభ్రతలో ఆదర్శంగా నిలుపుదామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు. 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర'లో భాగంగా ఎమ్మెల్యే సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి కర్నాటక నాగేపల్లి వరకూ ర్యాలీ నిర్వహించారు. చీపురు పట్టి చెత్త చెదారం తొలగించారు. మున్సిపల్ సిబ్బంది, టిడిపి కౌన్సిలర్లు, నాయకుల చేత స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నాయకులు రత్నప్ప చౌదరి, సామకోటి ఆదినారాయణ, మున్సిపల్ సిబ్బంది శివయ్య, ఏఈలు, సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వస్తువులను నియంత్రించాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

'స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర'లో భాగంగా శనివారం మండలంలోని రేగాటిపల్లి పంచాయతీలో ఎంపిడిఒ సాయి మనోహర్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనారోగ్యాలకు ప్లాస్టిక్ కారణమని, కావున ప్లాస్టిక్ వస్తువులు, పేపర్ ప్లేట్స్, పేపర్ గ్లాస్‌లు వాడకుండా ప్రత్యామ్నాయ వస్తువులు వాడాలని ప్రజలకు సూచించారు. అలాగే ప్రతి ఇంటి వద్ద, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి పరిరక్షించాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో పిఆర్ ఈఓ మమత, డిఐపిఓ శివ కుమారి, టెక్నికల్ అసిస్టెంట్ పుణ్యవతి, ఎపిఒ అనిల్‌కుమార్, ఇరిగేషన్ ఇంజినీర్ గురుప్రసాద్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, జనసేన నాయకులు ముచ్చురామి సుధాకర్‌రెడ్డి, చిలకం వెంకటరెడ్డి, జయరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ శిక్షణపై అవగాహన

ప్రజాశక్తి-గోరంట్ల

ఉచిత టైలరింగ్ శిక్షణపై శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికి ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు శిక్షణ పూర్తయిన తర్వాత కుట్టుమిషన్ ఇస్తుందన్నారు. మండలంలో 5 సెంటర్లలో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. మండలంలోని బీసీ, ఈబీసీ, కమ్మ, బలిజ సామాజిక వర్గం మహిళలు ఈ నెల 22వ తేదీ లోపు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణచౌదరి, పచ్చ అశోక్, వేణు, మరిరెడ్డిపల్లి నరసింహులు, జయరామ్, సంతోష్, సురేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు

తపాలా సేవలపై విస్తృత అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ శివ నాగరాజు

ప్రజాశక్తి-హిందూపురం

తపాలా శాఖ అమలు చేస్తున్న వివిధ రకాల పథకాలపై విస్తృత స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని విజయవాడ సర్కిల్ తపాలా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శివ నాగరాజు సూచించారు. శనివారం స్థానిక వాసవి ధర్మశాలలో హిందూపురం తపాలా డివిజన్ లక్ష్య సాధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో హిందూపురం పోస్టల్ డివిజన్ సాధించిన ప్రగతి సంతప్తికరంగా ఉందన్నారు. ప్రతి ఒక్క పోస్టల్ ఉద్యోగి డివిజన్ లో ఉన్న ప్రతి పౌరునికి తపాలా శాఖకు సంబంధించిన పోస్ట్ ఇన్సూరెన్స్, అకౌంట్ చేయించినప్పుడే ప్రజలతో సత్సంబంధాలు ఏర్పడతాయని తెలిపారు స్థానిక తపాలా సూపరింటెండెంట్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో హిందూపురం పోస్టల్ డివిజన్ గత ఐదు సంవత్సరాలుగా సాధించలేని ఆర్థిక లావాదేవీలు సాధించామని తెలియజేశారు. అనంతరం డివిజన్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామీణ తపాలా ఉద్యోగులకు సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అలాగే పోస్టల్ ఇన్సూరెన్స్ బాండ్స్, క్లైంట్స్ సకాలంలో పూర్తి చేయడంలో ప్రత్యేకత కనబరిచిన హిందూపురం, ధర్మవరం ఇన్సూరెన్స్ బ్రాంచీలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ మార్కండేయ, ఎఎస్‌పి మల్లికార్జున, కళ్యాణ్ రామ్, ఇన్స్‌పెక్టర్లు విమల్, రాజేష్, జిలాన్ బాషా పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి : కలెక్టర్

ప్రజాశక్తి - హిందూపురం

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ టీఎస్ చేతన్ మహిళలకు పిలుపు నిచ్చారు. శనివారం హిందూపురం పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక హిందూపురంలోని తెలుగు చేనేత పారిశ్రామిక శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ తీసుకుంటున్న మహిళలతో మాట్లాడారు. అనంతరం అక్కడే ఉన్నా చేనేత కార్మికులతో మాట్లాడారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర సాధనలో భాగస్వాములు కావాలి :

స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ టిఎస్ చేతన్ పేర్కొన్నారు. శనివారం హిందూపురం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించి స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హిందూపురం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. సర్కిల్ లో మానవహారంగా ఏర్పడి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు, మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, మున్సిపాలిటీ కమిషనర్ సంగం శ్రీనివాసులు, డీఈఈ మోహన్, ఎఈ శంకర్, మున్సిపల్ ఎంహెచ్ఓ శోభన్ రెడ్డి, మెప్మా డిఎంసి గంగులయ్య, మున్సిపల్ అధికారులు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియాన్ని పూర్తి చేయడానికి చర్యలు : పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదాన ఆవరణలో అర్ధాంతరంగా ఆగిపోయిన ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. అర్ధాంతరంగా ఆగిపోయిన ఇండోర్ స్టేడియాన్ని కలెక్టర్ పరిశీలించారు. సాంకేతిక వరమైన అంశాలను పరిశీలించి కార్య నిర్వహణ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇదే సమయంలో మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ గుడ్డం కొనేరుకి సంబధించిన నిధులు త్వరిత గతిన మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సతీష్, మహాలక్ష్మి, అంజలి, మంజుల, నాగేంద్రమ్మా, జిల్లా టీడీపీ అధ్యక్షులు అంజినప్ప, రాష్ట్ర కురువ కార్పోరేషన్ డైరెక్టర్ పరిమళ, మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు, మున్సిపల్ అధికారులు, టిడిపి నాయకులు, మెప్మా సిబ్బంది, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి :

నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ పేర్కొన్నారు. శనివారం హిందూపురంలోని జిల్లా ప్రధాన ఆసుపత్రి సమావేశ మందిరంలో జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల కోఆర్డినేటర్ తిప్పేంద్ర నాయక్, హిందూపురం జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ లింగన్న, హిందూపురం మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు, ఆర్ ఎం ఓ డేవిడ్, కమిటీ మెంబర్లు విద్యాసాగర్, శ్రీదేవి, లక్ష్మీ నరసింహ, ఎన్టీఆర్ వైద్య సేవ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఎన్టీఆర్ వైద్య సేవలు, స్పెషలిస్ట్ డాక్టర్లు ద్వారా ఇంకా మెరుగ్గా రోగులకు సేవలందించి వచ్చిన నిధులను ఆసుపత్రి అభివద్ధి, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. ఆసుపత్రి కమిటీ సభ్యులు కూడా ఆసుపత్రిని నిరంతరం సందర్శించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు గురించి సలహాలు ఇవ్వాలన్నారు. పలువురు రోగులు వారు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతులను అందించారు.



మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్. చేతన్

అన్న క్యాంటీన్ పరిశీలన : హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలోని అన్న క్యాంటీన్‌ను కలెక్టర్ పరిశీలించారు.క్యాంటీన్‌లో భోజనం నాణ్యతగా, రుచిగా ఉండటంతో కలెక్టర్ సంతప్తి వ్యక్తం చేశారు.

జర్నలిస్టులకు ఇంటిస్థలాలు కేటాయించాలి : పట్టణంలో వివిధ పత్రికల్లో, ఎలక్ట్రానిక్ మిడియాలో పని చేస్తున్న జర్నలిస్టులకు ఇంటి స్థలాలను కేటాయించాలని స్థానిక పాత్రికేయులు కలెక్టర్‌ను కోరారు. శనివారం జిల్లా ప్రభుత్వ అసుపత్రి ఆవరణంలో కలెక్టర్ ను కలిసి ఈ విషయంపై వినతిని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యదర్శి ప్రశాంత్, పాత్రికేయులు రమేష్, అల్లీ పీరా, గంగప్ప, ప్రకాష్, రమేష్ కుమార్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కు వినతిని ఇస్తున్న పాత్రికేయులు

నిర్లక్ష్యంగా వ్యవహరించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని మృతురాలి బంధువులు కలెక్టర్ ను కోరారు. ఇటీవల కాన్పు కోసం వచ్చిన ప్రీతీ (25) అనే మహిళ మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ విషయంపై మృతిరాలి భర్త, బంధువులు శనివారం జిల్లా కలెక్టర్ ను కలిసి వినతిని ఇచ్చారు. ఈ విషయంలో సమగ్ర దర్యాప్తు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.